ఉత్సాహంగా స్పోర్ట్స్‌ మీట్‌

దిల్‌సుఖ్‌నగర్‌: నారాయణ పాఠశాలల్లో శనివారం క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తపేట్‌లో నిర్వహించిన స్పోర్ట్స్‌ మీట్‌లో క్రీడాకారులు డాక్టర్‌ రామచంద్రుడు, తిరుపతయ్య పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు క్రీడలు మానసికోల్లాసాన్ని కల్గిస్తాయన్నారు. చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం హేమాంబర్‌, ఆర్‌ఐ రవిప్రసాద్‌, ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్‌ రెడ్డి పాల్గొన్నారు.

నా కూతురును బతికించండి

- ఇంగ్లాండ్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన హిమబిందు
- వైద్యానికి సాయం చేయాలని ప్రభుత్వానికి తల్లి అభ్యర్థన


లండన్‌లో చికిత్స పొందుతున్న హిమబిందు

నాగోలు: చైతన్యపురికి చెందిన హిమబిందు లండన్‌లోని ప్రెస్టన్‌ నగరానికి వెళ్లి బ్రొకె హేవన్‌ అనే హాస్పిటల్‌లో కేర్‌టేకర్‌గా ఉద్యోగంలో చేరింది. గత 24న రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే అక్కడి పోలీసులు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు కోమాలోకి వెళ్లినట్లు నిర్ధారించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా డ్రగ్స్‌ మత్తులో రాష్‌ డ్రైవింగ్‌తో ప్రమాదం జరిగినట్లు పోలీసులు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. గత 16 రోజులుగా ఆందోళన చెందుతున్న తల్లి వెంకట రమణమ్మ తమ ఆర్థిక పరిస్థితి బాగోలేదని, ప్రభుత్వం తమ కూతురు వైద్యానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేస్తుంది. హిమబిందుకు 8 ఏళ్ల కూతురు ఉందని, పాప తమ వద్దే ఉంటుందని వెంకట రమణమ్మ తెలిపారు.

మాటలు కలిపి.. దోపిడీలకు తెరలేపి!


సింగరేణి కాలనీలో అర్ధరాత్రి మద్యం విక్రయాలు (ఫైల్‌)


దారి దోపిడీలపై ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానికులు

"మొగల్‌పురాకు చెందిన కూరగాయల వ్యాపారి సయ్యద్‌ అక్బర్‌ ఇటీవల రాత్రి ఒంటి గంట సమయంలో తనద్విచక్ర వాహనంపై సింగరేణి కాలనీకి వచ్చాడు. అప్పుడే అతని వద్దకు వచ్చిన ఇద్దరు యువకులు తమను సమీపంలోని హాస్పిటల్‌ వద్ద దింపాలని కోరగా ఇద్దరిని తన బైక్‌పై ఎక్కించుకుని వెళ్తుండగా ఒక గల్లీలోకి వెళ్లగానే బైక్‌ ఆపి అక్బర్‌ను చితక్కొట్టి అతడి సెల్‌ఫోన్‌ లాక్కొని ఉడాయించారు."

"సైదాబాద్‌ ఎస్‌బీహెచ్‌ కాలనీకి చెందిన కాంట్రాక్టర్‌ రామ్మోహన్‌ యాదవ్‌ 15 రోజుల క్రితం సాగర్‌ రోడ్‌లోని స్నేహితుడి ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై తన ఇంటికి వెళ్తూ మార్గమధ్యలో సింగరేణి కాలనీ వద్ద ఆగాడు. అప్పుడే అతని వద్దకు వచ్చిన ముగ్గురు యువకులు మద్యం తెస్తామని నమ్మించి అతనిపై దాడి చేసి అతని వద్ద నుంచి నగదుతో కూడిన పర్సు, సెల్‌ఫోన్‌ లాక్కొని అక్కడి నుండి పరారయ్యారు. ఈ రెండు ఘటనలు సింగరేణి కాలనీలో తరచూ పునరావృతం అవుతున్న దారి దోపిడీ ఘటనలకు ఉదాహరణలు మాత్రమే."

- విచ్చలవిడిగా బెల్టు షాపులు
- మద్యం కోసం వచ్చే వారే టార్గెట్‌
- సెల్‌ఫోన్‌లు, నగదు తస్కరిస్తున్న ముఠాలు
- భయం గుప్పిట్లో సింగరేణి కాలనీవాసులు

సైదాబాద్‌: ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పరిధిలోని సింగరేణి కాలనీలో అక్రమ మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మరీ ముఖ్యంగా మద్యం దుకాణాలు మూసి తర్వాత తెల్లవారుజాము వరకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి మద్యం కోసం ఇక్కడికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకి పెరుగుతుంది. దాంతో పలువురు ఆకతాయి యువకులు ముఠాలుగా ఏర్పడి మద్యం కోసం వచ్చే వారే లక్ష్యంగా చేసుకొని వారిపై దాడులు చేస్తూ నగదు, సెల్‌ఫోన్‌లు తస్కరిస్తున్నారు. రాత్రి సమయం పెద్దగా జనసంచారం ఉండకపోవటాన్ని అదనుగా చేసుకొని అర్ధరాత్రుల్లో దోపిడీలకు పాల్పడుతున్నారు.

మత్తు పదార్థాలూ సైతం..

సింగరేణి కాలనీ గుడిసెల ప్రాంతం నగరంలోనే పెద్ద మురికివాడల్లో ఒకటి. ఇక్కడ నివసించే గుడిసెవాసుల్లో నిత్యం కూలీ పనులు చేసుకునే వారే అధికం. వారి వ్యసనాన్ని ఆసరాగా చేసుకొని ఇక్కడ పలువురు బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం విక్రయాలు మొదలు పెట్టారు. కేవలం మద్యమే కాకుండా యువతను లక్ష్యంగా చేసుకొని గంజాయి అమ్మకాలు సైతం విచ్చలవిడిగా సాగుతున్నాయి. గంజాయి, మద్యం మత్తులో యువకులు రాత్రి సమయాల్లో సింగరేణి కాలనీకి మద్యం కోసం వచ్చే వారిపై దాడులకు పాల్పడుతున్నారు.

గుడిసెవాసులకు తప్పని తిప్పలు...

అక్రమ మద్యం అమ్మకాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గుడిసెవాసులు వాపోతున్నారు. రాత్రీ, పగలు తేడా లేకుండా నగరంలోని ఎక్కడెక్కడి నుంచో ఎప్పుడు పడితే అప్పుడు మద్యం ప్రియులు తమ ఇళ్ల వద్ద తచ్చాడుతున్నారని వాపోతున్నారు. మద్యం కొనుగోలు చేసి కొందరు ఇక్కడే తాగి గొడవలు పడుతూ ఇక్కట్లకు గురి చేస్తున్నారన్నారు. రాత్రి సమయంలోనూ మద్యం కోసం వచ్చి తమ ఇళ్ల తలుపులు కొడుతూ భయాందోళనకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. ఈ దారి దోపిడీలు ఆగాలంటే పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు, ఎక్సైజ్‌ పోలీసులు మత్తు పదార్థాల క్రయవిక్రయాలపై నిఘా ఉంచి మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతున్నారు.

మద్యం విక్రయాల కట్టడితోనే పరిష్కారం



సింగరేణి కాలనీలో అక్రమ మద్యం, గంజాయి అమ్మకాల కట్టడితోనే దారి దోపిడీలకు పరిష్కారం కలుగుతుంది. పోలీసులు, ఎక్సైజ్‌ పోలీసులు ఇక్కడ మద్యం విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. బస్తీవాసులు కూడా పోలీసులకు సహకరించాలి. మద్యం అమ్ముతున్న కొందరి కారణంగా మొత్తం బస్తీకే చెడ్డ పేరు వస్తుంది. అక్రమ వ్యాపారుల గురించి స్థానికులు పోలీసులకు సమాచారమివ్వాలి.

–నాగరిగారి దాస్‌, ఐఎస్‌సదన్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ మాజీ అధ్యక్షుడు

చర్యలు తీసుకుంటున్నాం..



సింగరేణి కాలనీలో దారి దోపిడీ ఘటనల పట్ల సీరియస్‌గా ఉన్నాం. కొన్ని ఘటనల్లోని నిందితులను రిమాండ్‌కు తరలించాం. కాలనీలో నిరంతర గస్తీకి సిబ్బందిని నియమించాం. అవసరమైన చోట్ల విద్యుత్‌ స్తంభాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నాం. కాలనీలో వాహనాల తనిఖీలు సైతం విస్తృతంగా చేపడుతున్నాం. అక్రమంగా మద్యం విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటాం.

–రాఘవేందర్‌–సైదాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌

మహిళా సంక్షేమానికి కృషిచేస్తా


మాట్లాడుతున్న కార్పొరేటర్‌ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: మహిళా సంక్షేమానికి కృషి చేస్తానని హయత్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌ పరిధిలోని కమలానగర్‌లో నూతనంగా ఏర్పడిన మహిళా సంక్షేమ సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పుల్లమ్మ, రమణిరెడ్డి, ఇందిర, విజయనిర్మల, మహాలక్ష్మీ పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు స్పందన


ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీసీ

చాదర్‌ఘాట్‌: మలక్‌పేట సర్కిల్‌లో శనివారం నిర్వహించిన ఓటరు నమోదుకు స్పందన వచ్చిందని సర్కిల్‌–6 డిప్యూటీ కమిషనర్‌ సురేందర్‌సింగ్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగే స్పెషల్‌ క్యాంపులో దాదాపు 850 మంది నూతన ఓటరుగా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. పలువురు చిరునామాల మార్పుచేర్పులు చేసుకున్నారన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

ఎల్‌బీనగర్‌: కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. డివిజన్‌ పరిధిలోని గాయత్రినగర్‌ ఫేజ్‌–3 కాలనీ నూతన కార్యవర్గం శనివారం కార్పొరేటర్‌ను కలిసి సన్మానించారు. విద్యుత్‌, డ్రైనేజీ లైన్‌, వీధి దీపాలు, రోడ్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కాలనీవాసులు కార్పొరేటర్‌ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో రాజుగౌడ్‌, జగన్మోహన్‌రెడ్డి, రామకృష్ణ, శంకర్‌, రాజేందర్‌గౌడ్‌, మురళీ, నరేష్‌ రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల అందజేత


చెక్కు అందజేస్తున్న మధుయాష్కీగౌడ్‌

వనస్థలిపురం: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎంతో మంది పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌ అన్నారు. ఎల్‌బీనగర్‌ నియోజకవర్గానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను శనివారం ఆయన వనస్థలిపురం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సదాశివుడు, రవి, నరసింహాయాదవ్‌, వేణుగోపాల్‌ యాదవ్‌, షేక్‌ షబీర్‌, ఖదీర్‌, మహేందర్‌ యాదవ్‌, షరీఫ్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఇంకా స్టిక్కర్లే అంటిస్తున్నారు..

నత్తనడకన ఇంటింటి సర్వే


నాగోలు సాయినగర్‌ కాలనీలో ఓ ఇంటిలో వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు

వనస్థలిపురం: ఎల్‌బీనగర్‌ నియోజకవర్గంలో సమగ్ర కుటుంబ సర్వే నత్తనడకన సాగుతోంది. సర్వేకు సంబంధించి ఇంటింటికి స్టిక్కర్లు అంటించే కార్యక్రమం పలు చోట్ల శనివారం కూడా కొనసాగింది. 8వ తేదీ వరకు స్టిక్కర్లు అంటించి 9వ తేదీ నుంచి సర్వే ప్రారంభిస్తామని అధికారికంగా ప్రకటించినా పలు ప్రాంతాలలో అది అమలుకు నోచుకోలేదు. వనస్థలిపురం, హస్తినాపురం, మన్సూరాబాద్‌, హయత్‌నగర్‌, కొత్తపేట, నాగోలు, చంపాపేట తదితర ప్రాంతాల్లో ఇంకా సర్వే పూర్తిస్థాయిలో మొదలు కాలేదు. ఇంత వరకు 50 శాతం కూడా స్టిక్కర్లు అంటించలేదని తెలుస్తోంది.

మలక్‌పేట సర్కిల్‌–6లో..

చాదర్‌ఘాట్‌: కుటుంబ సర్వేలో భాగంగా మూడ్రోజుల పాటు జరిగిన ఇంటింటికి స్టిక్కరింగ్‌ కార్యక్రమం మలక్‌పేట సర్కిల్‌–6లో అసంపూర్తిగా కొనసాగింది. మొత్తం 73 వేల ఇళ్లు ఉండగా ఇంకా 15 వేల ఇళ్లకు స్టిక్కరింగ్‌ కాలేదని అధికారులు తెలిపారు. సర్కిల్‌–6లో ఎక్కువగా మైనారిటీలు ఉండటంతో ఎంట్రీ ఫారాలు ఉర్దూ, ఇంగ్లిష్‌లో లేక ఇంటి యజమానులు సర్వేను తిరస్కరిస్తున్నారని ఎన్యుమరేటర్లు తెలిపారు.

ఎర్రకుంట చెరువును సందర్శించిన హైడ్రా బృందం


చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

సైదాబాద్‌: ఎర్రకుంట చెరువు విషయమై రెవెన్యూ అధికారుల నుంచి రిపోర్ట్‌ తీసుకుంటామని హైడ్రా ఇన్‌స్పెక్టర్‌ తిరుమలేష్‌ తెలిపారు. శనివారం ఆయన హైడ్రా అధికారుల బృందంతో కలిసి సైదాబాద్‌ ఎర్రకుంట చెరువును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇక్కడి పరిశీలనలో చెరువు ఉన్నట్లు తెలుస్తుందని గతంలోనే ప్రభుత్వ నిధులతో చెరువుకు ప్రహరీ నిర్మించారని హెచ్‌ఎండీఏలోనూ ఎర్రకుంట చెరువుగా నమోదయిందని, చెరువు ఎఫ్‌టీఎల్‌, బఫర్‌జోన్‌ను కూడా గుర్తించారని తెలిపారు. కొందరు వ్యక్తులు తమ స్థలంగా చెబుతున్నారని ఎర్రకుంట స్థలం విషయంలో న్యాయ వివాదం ఉందన్నారు. ప్రైవేట్‌ వ్యక్తులను కూడా వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లను ఇవ్వమన్నామని తెలిపారు. ఎర్రకుంట చెరువు విషయంలో న్యాయ నిపుణుల సహాయం తీసుకొని తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. చెరువును పరిశీలించిన వారిలో హైడ్రా డీఈ ప్రవీణ్‌, ఏఈ మహేందర్‌, సైదాబాద్‌ ఎర్రకుంట హిందూ శ్మశానవాటిక సంక్షేమ సమితి ప్రతినిధులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, సహదేవ్‌ యాదవ్‌, కొరుడు భూమేశ్వర్‌, శ్రీకాంత్‌రెడ్డి, ధర్మరాజు ఉన్నారు.

శ్రీశైవ క్షేత్రపీఠంలో రక్తదాన శిబిరం


రక్తదానం శిబిరంలో పాల్గొన్న నిర్వాహకులు

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురంలోని శ్రీశైవ క్షేత్రపీఠంలో శనివారం పీఠం కమిటీ కార్య నిర్వాహణ అధ్యక్షుడు ప్రసాద్‌, వనితాశక్తి ఇంటర్నేషనల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ హేమ, పీఠం మేనేజర్‌ కోటేశ్వర్‌ రావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. పీఠాధిపతి శివస్వామి జన్మదినోత్సవాల సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌ రెడ్డి, శ్యాంసుందర్‌ గౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్‌, హ్యాండీక్రాఫ్ట్‌ మేళాకు స్పందన


మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్‌ ఇండియా హ్యాండ్లూమ్‌ అండ్‌ హ్యాండీక్రాఫ్ట్‌ మేళాకు స్పందన వస్తోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్‌, డిజైనర్‌, కాంతావర్క్‌, హ్యాండ్‌ బ్లాక్‌, ప్రింటెడ్‌, లినెన్‌, కలంకారీ, బెంగాల్‌ కాటన్‌, లక్నో చికాన్‌, బనారస్‌ చీరలు, లేడీస్‌ ఫ్యాన్సీ టాప్స్‌, డిజైనర్‌ బ్లౌజెస్‌, ఖాదీ మెటీరియల్‌, వన్‌గ్రామ్‌ గోల్డ్‌ జ్యూవెలరీ, జైపూర్‌ బెడ్‌ షీట్స్‌, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, గాజులు, తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్‌ అలీ తెలిపారు.

సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలి


కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మన్సూరాబాద్‌: సభ్యత్వ నమోదులో కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర సీనియర్‌ నేత సుభాష్‌చందర్‌జీ అన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్‌ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్యక్షతన శనివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కులమతాలకు అతీతంగా దేశ ప్రజల నుంచి సభ్యత్వ నమోదుకు మద్దతు వస్తుందని తెలిపారు. ఎల్‌బీనగర్‌ వాసులు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదుకు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యం నిర్ణయించగా ఇప్పటికే 70 వేలకు పైగా నమోదయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, పవన్‌కుమార్‌, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్‌ కొత్త రవీందర్‌గౌడ్‌, నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్‌, జక్కిడి ప్రభాకర్‌ రెడ్డి, గీతారెడ్డి పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

వనస్థలిపురం: పీపుల్స్‌ లైట్‌ ఫౌండేషన్‌ చారిటబుల్‌ అండ్‌ కల్చరల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో శనివారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టీ, పాస్టర్‌ రంగారావు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.23, వంకాయ రూ.50, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.42, కాలిఫ్లవర్‌ రూ.23, క్యాబేజీ రూ.33, క్యారెట్‌ రూ.75, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.45, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.35, సొరకాయ రూ15, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.65, చామగడ్డ రూ.35, మునగ రూ.45, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్‌ రూ.50, కీర రూ.18, బీన్స్‌ రూ.55, క్యాప్సికమ్‌ రూ.75.

ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

రెండో అంతస్తు నుంచి పడి..

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నాగోలు: ప్రమాదశాత్తు రెండో అంతస్తు నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రం, రాజ్వాపూర్‌ కంకాలి గ్రామానికి చెందిన రాకేష్‌ తివారీ అలియాస్‌ సాజు(32) నగరానికి వచ్చి రాక్‌టౌన్‌ కాలనీలో సమీపంలో దగ్గర బంధువైన పవన్‌కుమార్‌ పాండేతో కలిసి ఉంటూ గుడ్ల రవాణా వ్యాపారంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రాకేష్‌ తివారీ మానసిక పరిస్థితి బాగలేకపోవడంతో కొంతకాలంగా మందులు వాడుతున్నాడు. ఈ నెల 7న రాత్రి రాకేష్‌ తివారీ తాను ఉండే భవనంలో రెండో అంతస్తు నుంచి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారీపడి తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పవన్‌కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నాగోలు: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శివ నాగప్రసాద్‌ వివరాలు ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌ గోరఖ్పూర్‌ ప్రాంతానికి చెందిన దశరథ్‌, అజయ్‌ ఇద్దరు గతేడాదిగా నాగోలు ప్రాంతంలో ఉంటూ పెయింటర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 8న అజయ్‌ (27) పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నాడు. సాయంత్రం పని ముగించుకొని ఇంటికొచ్చిన దశరథ్‌ తలుపులు తట్టినా తీయలేదు. కిటికీలో నుంచి చూడగా అజేయ్‌ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రైతులు సహకరించాలి

ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ సాగర్‌ కాంప్లెక్స్‌ నుంచి వచ్చే వరద నీరు కాప్రాయ్‌ చెరువులో చేరకుండా గుర్రంగూడ ఫారెస్ట్‌ నుంచి విపశ్యన ధ్యాన కేంద్రం, దిగువన ఉన్న గాయత్రినగర్‌, పాపిరెడ్డి కాలనీ, క్రిస్టల్‌ విల్లాస్‌, మునగనూర్‌ మీదుగా తీసుకెళ్లి అంబర్‌పేట శివారులో కలపాలని ప్రణాళిక రూపొందించడం జరిగిందని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ శివారు కాలనీల డ్రైనేజీ అవుట్‌లెట్‌ కోసం సాహెబ్‌నగర్‌ గ్రామ రైతులతో ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇందులో భాగంగా చేపట్టిన ట్రంక్‌లైన్‌ పనులు క్రిస్టల్‌ విల్లాస్‌ ఎదురుగా ఉన్న రైతుల పొలాల వరకు వచ్చి ఆగిపోవడం జరిగిందని, దీంతో రైతులతో ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజావసరాలు గుర్తించి 21 కాలనీల డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం ట్రంక్‌లైన్‌ ఏర్పాటుకు భూయజమానులు కొంత స్థలం ఇవ్వాలని స్థలం ఇచ్చిన వారికి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సదుపాయాలను అందిస్తామన్నారు. అనంతరం భూయజమానులు మాట్లాడుతూ.. తమకు రెండు రోజులు సమయం ఇస్తే మాట్లాడుకుని సమస్య పరిష్కారానికి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ జిట్టా రాజశేఖర్‌ రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, జలమండలి డీజీఎం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్‌ డీఈ దామోదర్‌, రైతులు మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి


అపార్ట్‌మెంట్‌వాసులతో కలిసి వినతిపత్రం ఇస్తున్న సురేందర్‌యాదవ్‌

నాగోలు: బండ్లగూడ పరిధిలోని రాజీవ్‌ స్వగృహ సహాభావన సీ–బ్లాక్‌లోని సమస్యలను పరిష్కరించాలని శనివారం అపార్ట్‌మెంట్‌ వాసులు ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు నీటి బిల్లు సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే వాటర్‌ బోర్డు ఎండతో సమావేశం ఏర్పాటు చేసి నీటి సమస్యలపై చర్చిద్దామన్నారు. నీటి సమస్యను దృష్టిలో పెట్టుకొని మూడు బోర్‌వెల్స్‌ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో చింతల అరుణ సురేందర్‌ యాదవ్‌, నల్ల మునీందర్‌, వైల రాజశేఖర్‌, వెంకట్‌ రెడ్డి, శేఖర్‌, చెరుకూరి శ్రీనివాస్‌, విక్రమ్‌ రెడ్డి ఉన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి


మాట్లాడుతున్న జైపాల్‌ రెడ్డి

నాగోలు: జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్‌, అవుట్‌ సోర్సింగ్‌ విధానాన్ని రద్దు చేసి కార్మికులందరినీ పర్మనెంట్‌ చేసి కనీస వేతనాలు రూ. 26 వేలు అమలు చేయాలని రాష్ట్ర మున్సిపల్‌ స్టాఫ్‌–అవుట్‌ సోర్సింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌ రెడ్డి డిమాండ్‌ చేశారు. న్యూనాగోలు ఏఐటీయూసీ దాంగే భవన్‌లో శనివారం జిల్లా నాయకులు మద్దిలేటి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జైపాల్‌ రెడ్డి పాల్గొని మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా ఎక్కడ కూడా అమలు చేయడం లేదన్నారు. వెంటనే రాష్ట్రంలో సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కార్మికులు విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదం జరిగి మరణిస్తే రూ.25 లక్షలు ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఏఐటీయూసీ మున్సిపల్‌ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెలలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

నూతన కమిటీ ఎన్నిక..

ఎల్‌బీనగర్‌ జోన్‌ మున్సిపల్‌ సంఘం 27 మందితో కౌన్సిల్‌ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షులు యాదమ్మ, కార్య నిర్వాహక అధ్యక్షులు హంసమ్మ, ఉపాధ్యక్షులు వెంకటమ్మ, అంజయ్య, నందు, ప్రధాన కార్యదర్శి ఎం.మద్దిలేటి, సహాయ కార్యదర్శులు లక్ష్మమ్మ, కృష్ణవేణి, నరసమ్మ, కోశాధికారి లక్ష్మి, కౌన్సిల్‌ సభ్యులు సిహెచ్‌.పద్మ, అండాలు, విజయమ్మ, సుమత, లావణ్య, యాదమ్మ, రవి, రాజు,లలిత, సుజాత, కల్పన, మరో ఆరు మందిని కో ఆప్షన్‌ సభ్యులుగా ఎన్నుకున్నారు.